సాక్షి
ఒడిశా
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,29,963లు, బంగారం 3గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 29 గ్రాముల 300మిల్లీగ్రాములు, వచ్చాయని అధికారులు వెల్లడించారు.



వన దేవతల దర్శనం.. పోటెత్తిన భక్తజనం - 8లో



సీనియర్ న్యాయవాది ఉపేంద్రరావు మృతి - 8లో

న్యూస్‌రీల్

మూడు జిల్లాల్లో బంగారు నిక్షేపాలు

- మంత్రి ప్రఫుల్ల కుమార్ మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో బంగారు గనుల నిక్షేపాలు ఉన్నాయని గనుల శాఖ మంత్రి ప్రఫుల్ల కుమార్ మల్లిక్ తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ సామల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సోమవారం ఆయన ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడైనా బంగారు గనుల ఆచూకీ దొరికిందా? ఒకవేళ దొరికితే వివరాలు తెలియజేయాల్సిందిగా ఉక్కు, గనుల శాఖ మంత్రికి సుధీర్ సామల్ అభ్యర్థించారు. దీనిపై మంత్రి ప్రఫుల్ల కుమార్ మల్లిక్ స్పందిస్తూ దేవగఢ్, కియోంజర్, మయూర్‌భంజ్‌లోని వివిధ ప్రాంతాల భూగర్భంలో బంగారు నిక్షేపాలు ఉన్నాయన్నారు. గనులు–భూతత్వ డైరెక్టరేట్, జీఎస్‌ఐ పరిశోధనల్లో ఈ విషయం వెలుగు చూసిందని వివరించారు. దేవ్‌గుడ్ జిల్లా ఒడాస్, కియోంజర్ జిల్లా గోపూర్, గాజీపూర్, కుషాబొలా, ఒడాల్, తెల్కోయి సలేయికొనా, దిమిరిముండా, కొరాడొంగా, మయూర్‌భంజ్ జిల్లాలోని జోషీపూర్, సురియాగూడ, రుంవాన్సీ, ఇడెల్ కుచా, మారెడిహి, సులెయిపెట్టొ, బదాం పహాడో ప్రాంతాల్లో బంగారు నిక్షేపాల ఆచూకీ కనుగొన్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో నేరాలు పెరిగాయి

- హోం శాఖ సహాయ మంత్రి తుషార్ కాంతి బెహెరా

భువనేశ్వర్: రాష్ట్రంలో గత ఐదేళ్లలో నేరాలు పెరిగాయని హోం శాఖ సహాయ మంత్రి తుషార్ కాంతి బెహెరా తెలియజేశారు. సుందర్‌గఢ్ నియోజకవర్గం ఎమ్మెల్యే కుసుమ్ టెట్టే స్టార్ ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి తుషార్ కాంతి బెహెరా ఈ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని పోలీసుస్టేషన్లలో గత ఐదేళ్లలో ఎన్ని కేసులు నమోదయ్యాయని, రాష్ట్రంలోని పోలీసు సిబ్బందికి చివరిసారిగా ఆరోగ్య పరీక్షలు ఎప్పుడు నిర్వహించారని కుసుమ్ టెట్టే ప్రశ్నించారు. మంత్రి స్పందిస్తూ.. 2018 సంవత్సరంలో వివిధ పోలీసుస్టేషన్లలో 1,07,408 కేసులు నమోదయ్యాయని, 2019లో 1,21,525, 2020లో 1,34,230, 2021లో 1,55,420, 2022లో 1,78,190ల కేసులు నమోదయ్యాయని మంత్రి విశ్లేషించారు. 2020 సంవత్సరంలో అత్యధికంగా 1,470 హత్య కేసులు నమోదు కాగా, 2022లో అత్యధికంగా 626 దోపిడీ కేసులు, 2021లో అత్యధికంగా 3327 అత్యాచారం కేసులు నమోదు అయినట్లు తెలిపారు. 40 సంవత్సరాలు పైబడిన పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని వివరించారు.

త్వరలో వైద్యుల నియామకం

- ఆరోగ్య శాఖ మంత్రి నిరంజన్

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో 5 వేల మంది వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించనున్నట్లు ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నిరంజన్ పూజారి ప్రకటించారు. ఈ భర్తీ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జిల్లా రాయరంగ్‌పూర్ ఆస్పత్రిలో వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రుల్లో పడకల కొరతపై అడిగిన ప్రశ్నకు ఆరోగ్య శాఖ మంత్రి నిరంజన్ పూజారి స్పందిస్తూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుతున్నాయన్నారు. పడకల కొరతతో రోగులు వెనుదిరగడం లేదని స్పష్టం చేశారు. నిర్మల్ యోజన కింద ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను 25,636కు పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది సమగ్ర ఆరోగ్య అభివృద్ధి విధానంలో మరో 21,342 పడకల పెంపు ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అయితే మంత్రి సమాధానంపై విపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలు పాటించడం లేదని, రోగులకు పడకలు దొరకడం లేదని ప్రతిపక్ష పార్టీ చీఫ్ విప్ మోహన్ మాఝీ ఆరోపించారు.

పోలీసు శాఖలో 28,074 ఖాళీలు

భువనేశ్వర్: రాష్ట్రంలో 28,074 పోలీసు పదవులు, ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని హోం శాఖ సహాయ మంత్రి తుషార కాంతి బెహెరా తెలియజేశారు. అసెంబ్లీలో ఖండపడా నియోజకవర్గం ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని తెలిపారు. 4 కేటగిరీల్లో 28,074 వరకు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ఏ' కేటగిరీలో 297, 'బి' కేటగిరీలో 2,120, 'సి' కేటగిరీలో 11,620, 'డి' కేటగిరీలో 14,037 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అంతేకాకుండా పనిచేస్తున్న పోలీసు సిబ్బందిలో ఎంతమంది రవాణా శాఖతోపాటు ఇతర శాఖలకు డిప్యూటేషన్‌పై వెళ్లారనే వివరాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



విద్యార్థినుల గీతాలాపన

అదిరింది

- ఉత్సాహంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సంబల్‌పూరి గాయకుడు మంటూ ఛురియా పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. అదేవిధంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ షో కార్యక్రమం హైలెట్‌గా నిలిచింది. కళాకారుల నృత్య ప్రదర్శనలు, పాటలు అలరించాయి. మంటూ ఛురియా సంబల్‌పూరి పాటలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రధ్వజ పండ, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీజే రావులు వేదికపై నృత్యాలు చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూఢిల్లీకి చెందిన స్టార్టప్ ఒడిశా అధ్యక్షుడు హర్కేష్ మిట్టల్, గౌరవ అతిథిగా హాజరైన ముంబాయికి చెందిన పటేల్ ఇంజినీరింగ్ కళాశాల పీఆర్వో టీఎల్ శర్మలు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సాంకేతిక విద్య ఆవశ్యకతపై వివరించారు. ప్రతీ విద్యార్థి తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

– రాయగడ



మంటూ ఛురియా పాటలకు డాన్సులు చేస్తున్న పండ, ఏవీజే రావులు



విద్యార్థుల ఫ్యాషన్ షో



పాటలు పాడుతున్న మంటూ ఛురియా

మాజీ ఎమ్మెల్యే రాస మంజరీ దేవి మృతి

- అసెంబ్లీలో సభ్యుల సంతాపం



రాస మంజరీ దేవి(ఫైల్)

భువనేశ్వర్: అఠొగొడా తిగిరియా వంశీయుల చిట్టచివరి రాణి, అఠొగొడా నియోజకవర్గం మాజీ శాసనసభ సభ్యురాలు రాస మంజరీ దేవి(96) మరణించారు. ఆమె చాలాకాలంగా వృద్ధాప్యం వలన వచ్చిన అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. రాస మంజరీ దేవి మృతిపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీలో ముఖ్యమంత్రి శోక సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా విపక్ష నేతలు మద్దతు తెలిపారు. సభలో సభ్యులు కాసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

నేపథ్యం

దివంగత రాస మంజరి దేవి 1927 నవంబర్ 19వ తేదీన సోన్‌పూర్ రాజ కుటుంబంలో జన్మించారు. మహారాజా కుమార్ యశ్వంత్ సింగ్ దేవ్ ఏకైక కుమార్తె. తిగిరియా పాలకుల్లో చిట్టచివరి స్వాతంత్ర్య రాజు దివంగత వీరవర చంపతి సింగ్ మహాపాత్ర ధర్మపత్ని. 1969లో ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1970లో తిగిరియా పంచాయతీ సమితి మొదటి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 1977లో తొలిసారిగా శాసన సభకు ఎన్నికయ్యారు. 2002లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తిగిరియా 14వ మండలం నుంచి జిల్లా పరిషత్‌కు గెలిపొంది, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. ఆమె పార్థివ దేహాన్ని మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి, స్థానిక ఎమ్మెల్యే దేవీ ప్రసాద్ మిశ్రా, పలువురు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు దర్శించుకొని నివాళులర్పించారు.

తుపాకీ పేలి వ్యక్తి మృతి



కాంచినొ మృతదేహం తరలిస్తున్న దృశ్యం

రాయగడ: తండ్రీ, కొడుకుల మధ్య పెరిగిన పెనుగులాటలో తుపాకీ పేలి తండ్రి మృతి చెందిన ఘటన జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి కులసి పంచాయతీ గుడి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. తుపాకీ గుండు తగలడంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గుణుపూర్ సబ్ డివిజనల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గుడి గ్రామంలో కాంచినొ దొళొబెహర (63) అనే వ్యక్తికి గత కొన్నేళ్లుగా మతిస్థిమితం సక్రమంగా లేదు. ఈ క్రమంలో తరచూ గ్రామంలో గొడవలు పడుతూ ఉండేవాడు. దీంతో అతని కొడుకు మిజొ దొళొబెహర తండ్రిని వారిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఉన్న తన కోడలితో తగాదా పడిన కాంచినొ, క్షణికావేశంలో ఇంట్లో ఉన్న నాటు తుపాకీతో కోడలిని కాల్చబోయాడు. ఇది గమనించిన కొడుకు మిజో తండ్రి నుంచి తుపాకీని తీసుకునే ప్రయత్నం చేశాడు. ఇద్దరి మధ్య పెనుగులాటలో తుపాకీ గుండు పేలి తండ్రికి తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మిజోను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం .

పాత వంతెనల పునరుద్ధరణ

భువనేశ్వర్: రాష్ట్రంలో బ్రిటీష్ కాలం నాటి 17 పాత వంతెనలు ఉన్నాయని ఓడరేవులు, గృహ నిర్మాణ శాఖ మంత్రి ప్రఫుల్ల కుమార్ మల్లిక్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుతం ఈ వంతెనలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వీటికి మరమ్మతులు చేసి పునరుద్ధరణకు నిర్మాణ శాఖ కసరత్తు చేస్తోంది. అదేవిధంగా రాష్ట్రంలో 30 ఏళ్ల నాటి పాత కాలపు వంతెనలు 258 ఉన్నాయి. వీటి భద్రతపై ఆ శాఖ అధ్యయనం చేస్తోందని మంత్రి వివరించారు.

వందేళ్ల వేడుక



మహారాజా బాలికల ఉన్నత పాఠశాల

- నేడు మహారాజా బాలికల పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు



పాఠశాల హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్ ప్రధాన్

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలికల ఉన్నత పాఠశాల శత వార్షికోత్సవాలను మంగళవారం నిర్వహించనున్నారు. 1919లో అప్పటి పర్లాకిమిడి మహారాజు తన పట్టపు రాణి రాధామణి దేవి పేరు మీదుగా ఈ ప్యాలెస్ నిర్మించారు. అయితే అప్పట్లోనే ఆడ పిల్లలకు విద్య ఎంతో అవసరమని దూరదృష్టితో ఆలోచించి 1949లో బాలికల పాఠశాలగా మార్చారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఒడియా, తెలుగు మీడియంలో విద్యాబోధన చేసేవారు. వాస్తవానికి కళాశాల ప్యాలెస్‌కు 2019 నాటికే వందేళ్లు పూర్తయినా కరోనా, ఇతర కారణాల వలన గోల్డెన్ జూబ్లీ వేడుకలు వాయిదాపడ్డాయి. అనంతరం ఉత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉన్నత పాఠశాల ఆవరణలో మహారాజా శ్రీకృష్ణ చంద్రగజపతి నారాయణ దేవ్ విగ్రహావిష్కరణను ఆయన మనుమరాలు యువరాణి కల్యాణి దేవి గజపతి ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎం.పి.చంద్రశేఖర సాహు, గౌరవ అతిథులుగా పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఈవో ప్రదోష్ కుమార్ నాయక్, విశ్రాంత అధ్యాపకులు డా.స్వరాజ్య లక్ష్మి, ముఖ్యవక్తగా శైలబాలా పాఢి తదితరులు పాల్గొంటారని హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్ ప్రధాన్ తెలియజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: ఒడిశా మెడికల్ సేల్స్ రిప్రజెంటేషన్ అసోసియేషన్ కొరాపుట్ శాఖ జయపురంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించింది. జయపురం కార్మిక భవనంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అసోసియేషన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 40 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రిన్స్ కిలాడి, కార్యదర్శి లక్ష్మణ మిశ్ర, సభ్యులు రంజన్ మిశ్ర, సంతోష్ దొళాయి, ఎం.శ్రీనివాసరావు, ఝుడేశ్వర పండ, దేవాశిశ్ మిశ్ర, సరోజ్ మహరాణ, కార్తీక రౌత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆదివాసీ విద్యా ప్రగతికి సీఎం కృషి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సరక తదితరులు

- మంత్రి జగన్నాథ్ సరక

జయపురం: రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా ప్రగతికి సీఎం నవీన్ పట్నాయక్ విశేషంగా కృషి చేస్తున్నారని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ్ సరక అన్నారు. బొయిపరిగుడ సహిద్ లక్ష్మణ నాయిక్ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బొయిపరిగుడ సహిద్ లక్ష్మణ నాయిక్ +2, +3 కళాశాలల ఉన్నతికి రూ.కోటి మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే విద్యార్థుల కోసం త్వరలో హాస్టల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఉన్నత మాధ్యమిక పాఠశాల ప్రిన్సిపాల్ కుముదురంజన్ మహారాణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్, నవరంగపూర్ ఎంపీ రమేష్ చంద్ర మఝి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పదిృనీ ధియాన్, బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రశాంత కుమార్ గుప్త, జిల్లా పరిషత్ సభ్యులు రాజేశ్వర మహరియ, బొయిపరిగుడ బీడీవో అభిమన్యు కవిశతపతి, సర్పంచ్ సూర్యమణి నాయిక్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా టీచర్స్–11



విజయ సంకేతం చూపిస్తున్న టీచర్స్–11 టీమ్ సభ్యులు

జయపురం: స్థానిక అంబాగుడ మినీ స్టేడియంలో జయపురం ఉపాధ్యాయ సంఘం సభ్యులు సోమవారం నిర్వహించిన స్నేహపూరిత క్రికెట్ టోర్నమెంట్‌లో జయపురం టీచర్స్–11 టీమ్ విజేతగా నిలిచింది. పోటీలో రామనగుడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్–11 టీమ్, జయపురం టీచర్స్–11 టీమ్‌లు తలపడ్డాయి. మొదట జయపురం ఉపాధ్యాయ–11 టీమ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడంతో, రామనగుడ సీహెచ్‌సీ–11 టీమ్ బ్యాటింగ్ చేసింది. రామనగుడ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం 132 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన టీచర్స్–11 టీమ్ 14.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. టీచర్స్–11 టీమ్‌లో ఉపాధ్యాయుడు రమేష్ నాయిక్ 42 బంతుల్లో 55 పరుగులు చేయగా, మరో ఉపాధ్యాయుడు మనోరంజన్ పాలాయి 16 బంతుల్లో 33 పరుగులు చేసి విజయానికి బాటలు వేశారు. కార్యక్రమంలో జయపురం బ్లాక్ విద్యాధికారి పి.హరిశ్చంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీకాంత పాఢీ, రామనగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.చైతన్యలు పాల్గొన్నారు. పోటీలను జయపురం ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు దేబప్రసాద్ దాస్, కార్యదర్శి మహేశ్వర మిశ్రల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్లాన్ ప్రకారమే నవకిషోర్ హత్య

- కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి ఆరోపణ

భువనేశ్వర్: మంత్రి నవ కిషోర్ దాస్‌ను ప్లాన్ ప్రకారమే హత్య చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి తీవ్ర ఆరోపణలు చేశారు. హత్య అంశాన్ని అసెంబ్లీ శూన్య గంట సమావేశంలో కాంగ్రెస్ సభ్యులు మంగళవారం ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ.. ఘటనపై భారతీయ జనతా పార్టీ సీబీఐ విచారణ డిమాండ్ చేస్తోందని, తాము ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ కోరుతున్నట్లు పేర్కొన్నారు. హత్యపై సభలో ప్రభుత్వ వైఖరి, విచారణపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలియజేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న గోపాల్ దాస్‌కు మతిస్థిమితం లేకపోవడమే కాకుండా, ఎందుకు చంపాడో విచారణలో తేలాల్సి ఉందని నిలదీశారు. కేసుకి సంబంధించి హోంమంత్రి ఎప్పటికప్పుడు అసెంబ్లీలో సమాచారాన్ని అందజేయాలని స్పీకర్ రూలింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంలో భట్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే సుశాంత్ సింగ్‌ను విచారణ పరిధిలోకి తీసుకోవాలని కంటాబంజి నియోజకవర్గం ఎమ్మెల్యే, కాంగ్రెస్ సభ్యుడు సంతోష్ సింగ్ సలుజా ప్రతిపాదించారు.

క్లుప్తంగా

తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు


సువేందు కుమార్ జెన్న

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సువేందు కుమార్ జెన్న సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ డిజస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అనుమతి లేనిదే సువేందు కుమార్ జిల్లా విడిచి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మధుర పహడ్ శైవక్షేత్రం అభివృద్ధి చేస్తాం

- నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ రమేష్

కొరాపుట్: మధుర పహడ్ శైవక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి ప్రకటించారు. ఉమ్మర్‌కోట్ సమితి తోహరా గ్రామ పంచాయతీ కిరపానీ గ్రామ సమీపంలోని కొండల్లో ఉన్న శివ లింగాన్ని ఎంపీ సోమవారం దర్శించుకున్నారు. ఇటీవల తాను హరిశంకర్ పుణ్యక్షేత్రం దర్శించిన విషయం గ్రామస్తులు తెలుసుకొని ఈ క్షేత్రానికి ఆహ్వానించారన్నారు. దాదాపు రెండు కిలోమీటర్ల కాలి నడకన కొండ గుహల్లో ఉన్న క్షేత్రం చాలా అద్భుతమైనదని అభివర్ణించారు. ఈ క్షేత్రానికి రోడ్డు, లింగం వరకు మెట్లు, తాగునీరు, వసతి, యాత్రికుల విశ్రాంతి భవనం, వంట గది నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడ జరిగే యాత్రని ప్రారంభించారు.

కిన్నెరలకు గుర్తింపు కార్డులు పంపిణీ


కార్మిక శాఖ కార్యాలయం వద్ద అధికారులతో కిన్నెర సంఘం సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కిన్నెర సంఘ సభ్యులకు కార్మిక గుర్తింపు కార్డులు లభించాయి. జిల్లా కేంద్రంలోని కార్మిక కార్యాలయంలో జిల్లా కార్మిక శాఖాధికారి రంజన్ కిషోర్ బెహరా ఈ కార్డులు అందజేశారు. కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర జిల్లాలో హిజ్రాల సామాజిక భద్రతకు ఎన్నో చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో తొలిసారిగా కిన్నెర సంఘం ఏర్పాటైంది. ఆ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ధ్రువపత్రం కలెక్టర్ చొరవతో లభించింది. అనంతరం కిన్నెరల విజ్ఞప్తితో వారికి కార్మిక గుర్తింపు కార్డులు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మనోజ్ కుమార పట్నాయక్, చుంకి కిన్నెర, కాజల్ కిన్నెర, సోను కిన్నెర, ప్రీతి కిన్నెర, కల్పన కిన్నెర, కృష్ణ రథో తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణకు అనూహ్య స్పందన


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సింగ్ తదితరులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణకు అనూహ్య స్పందన లభించింది. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్పీ వివేకానంద శర్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్ కుమార్ కుహారొ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శాంతి ప్రభప్రధాన్ తదితర శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. మొత్తం 270 వినతులు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. వినతుల స్వీకరణలో భాగంగా ఒకరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 వేలు, మరో ఇద్దరికి రెడ్‌క్రాస్ నిధుల నుంచి ఐదు వేలు చొప్పున అందజేశారు. సకాలంలో వినతులను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

159 మందిపై బైండోవర్ కేసులు

జియ్యమ్మవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా 159 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట సోమవారం హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాలలో ఎటువంటి అలజడి సృష్టించినా వారిపై తగు చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ఓటర్లంతా సహకరించాలని కోరారు.

వన దేవతల దర్శనం..

పోటెత్తిన భక్తజనం


హాజరైన వేలాదిమంది భక్తులు


గిరిజన సాంప్రదాయ పద్ధతితో దేవతామూర్తులను నది దాటిస్తున్న పూజారులు


వన దేవతామూర్తులకు స్నానం చేయిస్తున్న దృశ్యం


అందుబాటులో ఓడ్రాఫ్ బృందం


తొలిపూజ అందుకుంటున్న దేవతామూర్తులు


పోలేరు నదీ ఘాట్ వద్ద వైద్య శిబిరం


కొండపై నుంచి బయల్దేరిన ఘట్టాలు


పోటీంగ్ వంతెన పైనుంచి వస్తున్న భక్తులు

జిల్లాలోని కలిమెల సమితి ఆంధ్ర–ఒడిశా బోర్డర్ పోలేరు గ్రామం వద్ద తడిక రేవులో వన దేవతామూర్తులు శ్రీకన్నంరాజ్, (శ్రీకృష్ణుడు), శ్రీబాల్‌రాజ్(అర్జునుడు), శ్రీపోతురాజ్(భీముడు)లకు మా ముత్యాలమ్మ తల్లితో అంగరంగ వైభవంగా సోమవారం స్నానం చేయించారు. ఈ సమయంలో దేవతామూర్తులను ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ, ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. వారం రోజుల పాటు దేవతామూర్తులకు జాతర చేస్తారు. దీనిలో భాగంగా మన్యంకొండ గ్రామం వద్ద సోమవారం దేవతామూర్తులు ప్రారంభమై మార్చి 7వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో భక్తులకు దర్శనమిచ్చి మరలా పోలేరు చేరుకుంటారని అర్చకుడు త్రినాథ్ రాజ్ తెలియజేశారు.

– మల్కన్‌గిరి

సీనియర్ న్యాయవాది ఉపేంద్రరావు మృతి

- న్యాయవాదుల నివాళులు



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు (ఇన్‌సెట్లో) ఉపేంద్రరావు(ఫైల్)

జయపురం: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఉపేంద్రరావు(86) విశాఖపట్నంలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన జయపురం మున్సిపాలిటీకి వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో పట్టణాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో తెలుగు బోధన ఎత్తివేసిన సమయంలో నెలకొల్పిన జయపురం తెలుగు సాంస్కృతిక సమితి ఏర్పాటులో విశేష కృషి చేశారు. ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

సంతాపం

కొరాపుట్: సీనియర్ న్యాయవాది ఎం.ఉపేంద్రరావు మృతికి కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో నివాళులర్పించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టుల సముదాయంలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంతాప సభ జరిగింది. సీనియర్ న్యాయవాది సీహెచ్ బాబా యుగంధర్ మాట్లాడుతూ.. అవిభక్త కొరాపుట్ జిల్లాలకు జయపురం కేంద్రంగా ఉపేంద్రరావు సీనియర్ న్యాయవాదిగా ఎన్నో సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాం ప్రసాద్ పాత్రో, హరి బెహరా, కె.చంద్ర శేఖర్‌రావు, మున్నా బెనియా, మీనాక్షి పాడి, నమితా పటాన్నయక్, షర్మిష్టా రథో, రాకి జైన్, పుష్పాంజలి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంతాప సూచకంగా న్యాయవాదులు తమ కేసులు వాయిదా వేసుకోవడానికి న్యాయమూర్తుల అనుమతి తీసుకోవడంతో కోర్టులో సేవలు నిలిచిపోయాయి.

కొరాపుట్‌లో...

కొరాపుట్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఉపేంద్రరావు నైతిక విలువలతో కూడిన న్యాయ సేవలు అందజేశారని సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎం.ముత్యాలరావు, జామి సంతోష్, శరత్ ఆచార్య, మనోజ్ రంజన్ రౌత్రాయ్, బీఎం పట్నాయక్, ఆర్‌వీఆర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొట్‌పాడ్ పట్టణంలోని కోర్టుల సముదాయంలో సంతాప సభ నిర్వహించారు.


కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఉపేంద్రరావుకి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ప్రమాణ స్వీకారం


రాష్ట్ర సమాచార కమిషనర్‌గా సుశాంత కుమార్ మహంతి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

- భువనేశ్వర్

ఆకతాయిల అరాచకం

- వేపాడ హైస్కూల్‌లో వీరంగం
- పోలీసులకు సమాచారం ఇచ్చిన హెచ్‌ఎం


ఆకతాయిలు పాడుచేసిన తరగతి గదులను పరిశీలిస్తున్న పోలీసులు, మహిళా పోలీసులు

వేపాడ: మండలకేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆరాచకాలు రోజురోజుకు పెరిగిపోవడంతో పాఠశాల హెచ్‌ఎం వల్లి ఉపాధ్యాయులు వల్లంపూడి పోలీసులకు సోమవారం సమాచారం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ ఉన్నప్పటికీ ఆకతాయిలు చొరబడి తరగతిగదులు పాడుచేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం పాఠశాలకు వచ్చి చూసేసరికి 9,10 తరగతుల గదుల తలుపులు పగులగొట్టి ఉన్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గదుల్లోకి వెళ్లి చూసేసరికి గదిలో కర్బూజా పండు ముక్కలు తిని టేబుల్స్‌పై రుద్దారు. మద్యం సీసాలు అక్కడే వదిలేశారు. మూత్రవిసర్జన చేయడంతో పాఠశాల తరగతి గదులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో పాఠశాల హెచ్‌ఎం మహిళాపోలీసులకు సమాచారం ఇచ్చి వల్లంపూడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, మహిళా పోలీసులు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. గతంలో పలు పర్యాయాలు ఇలానే తరగతి గదులు పాడుచేస్తుండడంతో పోలీసులకు సమాచారం అందించారు. కొంతకాలంగా ఏమీ జరగలేదని, మళ్లీ గత వారంలో ట్యాబ్‌లన్నీ విరగ్గొట్టారని చెప్పారు. గ్రామపెద్దలు, పోలీసులు సహకరించి పాఠశాలలో అభ్యంతరకరమైన పనులు జరగకుండా చూడాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

33 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

భామిని: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న 33 పీడీఎస్ బియ్యం బస్తాలను పట్టుకుని సీజ్ చేశామని బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు సోమవారం తెలిపారు. సుమారు 1650 కేజీల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించామని, వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

ఎన్‌సీసీ విద్యార్థినికి అభినందనలు


అభినందిస్తున్న ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ సీఎండీ అరవింద్

విజయనగరం అర్బన్: స్థానిక సీతం కళాశాల ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ బీటెక్ విద్యార్థిని అన్నా నేహా థామస్‌ను కళాశాలలో సోమవారం అభినందించి సత్కరించారు. ఎన్‌సీసీ ఢిల్లీ నుంచి కమాంటేషన్ కార్డ్‌ను ఆమె ఇటీవల సాధించింది. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ సీఎండీ అరవింద్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో 2(ఏ) గర్ల్స్ బీఎన్, ఎన్‌సీసీ విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ కల్నర్ ఏకేనౌతియాల్, ఏఓ మేజర్ శివాలి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామ్మూర్తి, కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఆదివారం గాయపడిన వ్యక్తి విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలం వెదురువాడ గ్రామానికి చెందిన రేగిడి రాము, సూర్యం దంపతులు విజయనగరం నుంచి దిచక్రవాహనంపై స్వగ్రామం వెదురువాడ వస్తుండగా మండలంలోని కొర్లాం కాటా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యం అక్కడక్కడే మృతిచెందింది. తీవ్రగాయాల పాలైన రామును 108లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ రాము సోమవారం ఉదయం 6 గంటల సమయంలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: భర్త, తోడికోడళ్ల వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఉడాకాలనీలో నివాసముంటున్న మమత (25) కొంతకాలంగా భర్త, తోడికోడళ్ల వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఆదివారం రాత్రి తాను నివాసం ఉంటున్న ఇంటికి ఎదురుగా సాయిబాబా ఆలయం వద్ద ఉన్న ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త రామారావు మైలాన్ పరిశ్రమలో కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

మూడో అంతస్తు నుంచి జారి పడి వ్యక్తి మృతి

స్థానిక తోటపాలెంలో గల ఓ ఇంటి మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ ఇంటికి ఆమె స్నేహితుడు సంజయ్ నాయుడు (25) సోమవారం వచ్చాడు. ఆయన వచ్చిన కాసేపటికి ఆమె భర్త ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో వెళ్లిపోదామని బయలుదేరిన నాయుడు ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి జారిపడిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు రాధిక శ్రీ


తూముల రాధిక శ్రీ

టెక్కలి: స్థానిక మహాత్మా జ్యోతి బా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తూముల రాధిక శ్రీ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ షిప్-2023 పోటీలకు ఎంపికైంది. ఇటీవల కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో రాధిక శ్రీ కీలక పాత్ర పోషించడంతో ఈ పోటీలకు ఎంపిక చేశారు. మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం గోల్డెన్ రూల్ పాఠశాలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. విద్యార్థిని ఎంపికపై ప్రిన్సిపాల్ దామోదర రావు, పీఈటీ హేమలత, పాఠశాల ఉపాధ్యాయినిలు, తల్లిదండ్రులు మహేశ్వరరావు, సుశీల అభినందించారు.

నేడు జిల్లా అండర్-19 హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు మంగళవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా 28న మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ జరగనున్నట్టు చెప్పారు. ఈ 2003 జనవరి ఒకటి తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టును కర్నూలు జిల్లా వేదికగా మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే 7వ ఏపీ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2022-23 పోటీలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా జట్టు ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ (ఎస్ఎస్‌సీ)పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సంఘ కార్యనిర్వహన కార్యదర్శి, పీడీ డి.ఈశ్వరరావు (94937 64447)ను సంప్రదించాలన్నారు.

చిరుధాన్యాలే మేలు: కలెక్టర్


రాగిజావను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. చిరుధాన్యాల ఆహార పండుగ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్ద స్పందనలో చిరుధాన్యాల ఆహార ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ స్పందన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుదారులకు, జిల్లా అధికారులకు చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి జావ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. చిరుధాన్యాల్లో పోషకాలను గుర్తించి అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం ప్రకటించడం అభినందనీయమన్నారు.

పొరుగు రాష్ట్రాలకు ఉద్దానం పనస

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానం పనస పొరుగు రాష్ట్రాలకు పయనమవుతోంది. ప్రస్తుతం పనస పిందె స్థాయిలో ఉండటంతో కూరలకు అనుకూలంగా ఉంటుంది. దీంతో వ్యాపారులు రైతులను ఆశ్రయిస్తూ కొనుగోలు చేస్తున్నారు. నేరుగా వ్యాపారులు రైతుల వద్దకు వెళ్లి కేజీ పనస కాయ ధర రూ. 20లకు కొనుగోలు చేస్తూ, రెండు, మూడు రూపాయలకు అదనంగా బరంపురం, కటక్, ఖుర్దా, గుజరాత్, కోల్‌కత్తా, ముంబై వంటి ప్రదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

మానవ నాగరికత పాత రాతియుగం నుంచి మొదలైందని చరిత్ర చెబుతోంది. అంటే.. కొన్ని లక్షల సంవత్సరాల నుంచే రాయితో మన మనుగడ సాగుతోందన్న మాట. రాళ్లతోనే నిప్పు రాజేయడం, రాతి ఆయుధాలు, రాళ్లతో చేసిన గృహోపకరణాలు మానవ జీవనంలో భాగంగా ఉండేవి. శ్రమైక జీవన సౌందర్యం వెల్లివిరిసేది. రాతి గృహోపకరణాల వినియోగం ద్వారా శరీరానికి మన ప్రమేయం లేకుండానే వ్యాయామం లభించేది. ఆహార పదార్థాలకు అద్భుత రుచి సమకూరేది. ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమయ్యేది. కానీ కాలం మారింది. బిజీ జీవనంతో పాటు మనిషి సుఖమెరిగాడు. రాతి గృహోపకరణాల స్థానంలో యంత్రాలు రంగప్రవేశం చేశాయి. ఫలితంగా శరీరానికి వ్యాయామం తగ్గింది. దాని కోసం మళ్లీ జిమ్‌లను, ఏరోబిక్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ఇటీవలి కాలంలో మళ్లీ రాతి గృహోపకరణాలు మన జీవితంలోకి వస్తున్నాయి. కొంత ఆధునికతను అద్దుకుని వస్తున్న ఇవి ప్రజాదరణ చూరగొంటున్నాయి. వీటి అమ్మకాలు, వినియోగం కూడా పెరుగుతున్నాయి.


పాలఖండ్యాంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రాతి గృహోపకరణాలు

ఆధునిక రాతి యుగం


సన్నికల్లు చెక్కుతూ..

- రాతి గృహోపకరణాలకు మళ్లీ ఆదరణ
- స్టీల్ హ్యాండిల్స్ తో సులువుగా వాడుకోవచ్చు
- శరీరానికి వ్యాయామం.. జిహ్వకు రుచి
- స్థానికంగా తయారీతో పాటు చెన్నై నుంచి దిగుమతి



శ్రీకాకుళం డెస్క్:

నేటి తరానికి ఆ పేర్లు పలకాలంటేనే ఇబ్బంది. ఇంట్లో ఏదో మూలన ఉన్నా వాటి పనితీరు తెలుసుకోవాలంటేనే అనాసక్తి. శిల్పి శిలను చెక్కి శిల్పంగా మార్చినట్లు.. బండరాయిని తీసుకుని మన అవసరాలకు అనుగుణంగా గృహోపకరణాలు రూపొందించారు పూర్వీకులు. వాటిని వినియోగించి అటు ఆరోగ్యంగా.. ఇటు శారీరకంగా శ్రమించి జీవితకాలాన్ని గడిపారు. ఇంతకీ ఏమిటవీ అనేదేగా మీ ప్రశ్న. అవేనండీ ఇంట్లో మూలకు చేరిన తిరగలి.. రుబ్బురోలు.. గొడ్డ.. సన్నిరాయి తదితరాలు. మళ్లీ వీటి వినియోగం ఇటీవల కాలంలో పెరుగుతోంది. సులువుగా వినియోగించేందుకు స్టీల్ హ్యాండిల్స్‌ను అమర్చి ఈ గృహోపకరణాలను 'చెక్కు'తున్నారు.

పాలఖండ్యాంలో 30.. పాకివలసలో 20..

శ్రీకాకుళం నుంచి రాజాం వెళ్లే మార్గంలో పాలఖండ్యాం వద్ద రోడ్డు పక్కన ఈ సంప్రదాయ రాతి గృహోపకరణాలు మనకు దర్శనమిస్తాయి. 8దుకాణాల్లో వివిధ రకాల సైజుల్లో తిరగళ్లు.. రుబ్బు రోళ్లు.. సన్నిగొడ్డలు.. ఇక్కడ విక్రయిస్తున్నారు. 30 ముస్లిం కుటుంబాలు వీటి తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. రోజూ పరిసర గ్రామాలకు ఆటోలపై సరుకును తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు తయారీదారులు. కొన్నింటిని చెన్నై నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే కోటబొమ్మాళి మండలం పాకివలసలో 20 ముస్లిం కుటుంబాలు వీటి తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

నిమ్మాడ నుంచి రాయి..

వీటి తయారీకి నల్లజనపరాయిని వినియోగిస్తున్నారు. ఈ రాయి కోసం టెక్కలి సమీపంలో ఉన్న నిమ్మాడ గ్రానైట్ పరిశ్రమల నుంచి రాయిని సేకరిస్తున్నారు. క్రషింగ్‌లో పగిలిపోయిన బండలను అడుగుల లెక్కన కొనుగోలు చేస్తున్నట్లు తయారీదారుడు సయ్యద్ రంజాన్ తెలిపారు.

ధరలు ఇలా..

రాతి గృహోపకరణాల ధరలు సైజును బట్టి రూ.500 నుంచి రూ.800 వరకు ఉన్నాం

చక్కటి వ్యాయామం..



తిరగలి వినియోగించడం వల్ల నడుం, వీపు, చేతి కండరాలు, పొట్టముందు భాగం ఛాతి కండరాలకు చక్కటి వ్యాయామం. వెన్నుపూస ఫ్లెక్సిబులిటీ పెరుగుతుంది. ఇది ఏరోబిక్ ఎక్సర్‌సైజ్. రోలును నిలబడి వినియోగించడం వల్ల చేయి, భుజంతో పాటు ఛాతీ భాగానికి మంచి వ్యాయామం. ఇది మోడరేట్ ఇంటెన్సిటీ ఏరోబిక్ ఎక్సర్‌సైజ్. వీటిని దినచర్యలో భాగంగా చేసుకుంటే సర్వైకల్ స్పాండిలైటిస్, లంబా స్పాండిలైటిస్ వంటివి రాకుండా నిరోధించవచ్చు. కండరాల బలహీనతల వల్ల వచ్చే వ్యాధులకు ముందే చెక్ పెట్టవచ్చు.
– డాక్టర్ బగాది రఘు, ఎంపీటీ ఇన్ ఆర్థోపెడిక్స్

అమ్మకాలు పెరిగాయి..



నల్లజనపరాయితో వీటిని చాలా ఏళ్లుగా తయారు చేస్తున్నాం. ఇటీవలి కాలంలో వీటి అమ్మకాలు బాగా పెరిగాయి. చిన్న చిన్న రోళ్లను పెళ్లిళ్లకు గిఫ్ట్ ఆర్టికల్స్‌గా ఇచ్చే సంస్కృతి పెరిగింది. కొన్నింటిని మేము తయారు చేస్తున్నాం. మరికొన్ని చెన్నై నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. –సయ్యద్ రంజాన్, తయారీ దారు, పాలఖండ్యాం

ఆ రుచే వేరు..



వీటిని ఉపయోగించి చేసే పచ్చళ్లు, ఇతర వంటకాలు భలే రుచిగా ఉంటాయి. నేను చిన్ననాటి నుంచి వీటినే వినియోగిస్తున్నాను. కరెంట్ షాక్‌లు ఇతర ఇబ్బందులుండవు. చక్కగా శుభ్రం చేసుకోవచ్చు. శారీరక వ్యాయామం కూడా.
–కుప్పబోడెమ్మ, పాలఖండ్యాం

వినియోగిస్తే మంచిది..



ఉరుకుల పరుగుల జీవనంలో మహిళకు శారీరక శ్రమ తగ్గింది. ఒబెసిటీ పెరిగిపోతోంది. ప్రతి పనికీ ఓ మెషీన్ వచ్చి చేరింది. సంప్రదాయ గృహోపకరణాల వినియోగం తగ్గింది. ముఖ్యంగా గర్భిణులు రాతి పరికరాలను వినియోగిస్తే మంచి వ్యాయామం. ఏడోనెల వరకు ఇలాంటి పరికరాలతో పనులు చేసుకోవచ్చు. శారీరక శ్రమతో ప్రసవం సులువవుతుంది.
– జి.జ్ఞాన ప్రసూన, గైనికాలజిస్ట్, జిల్లా ఆస్పత్రి టెక్కలి

ప్రయోజనాలెన్నో




శారీరక శక్తిని వినియోగిస్తే విద్యుత్ శక్తిని ఆదా చేయవచ్చు. తద్వారా పర్యావరణానికి మేలు.
- ఎలక్ట్రిక్ సాధనాలైన మిక్సీ, గ్రైండర్‌లను వినియోగించి చేసే వంటలకంటే వీటిని ఉపయోగించడం వల్ల రుచిలో చాలా తేడా ఉంటుంది.
- తయారు చేసిన ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం ఎక్కువ.
- పోషకాలు అలాగే ఉంటాయి.
- చక్కగా శుభ్రం చేసుకునే సదుపాయం ఈ రాతి వస్తువుల సొంతం.

ప్రాణాలు తీసేశారు


సంఘటన స్థలంలో హత్యకు గురైన బాలకృష్ణ, పోలీసులు, గ్రామస్తులు

- ప్రియుడి సాయంతో భర్తను కడతేర్చిన భార్య
- అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే హత్య
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

రణస్థలం: వరిసాం నుంచి చిల్లపేట లే అవుట్ల వైపు వెళ్లే దారిలో మర్రి చెట్టు కింద సోమవారం ఉదయం జీరు బాలకృష్ణ(35) అనే వ్యక్తి మృతదేహం కనిపించింది. చూస్తే ఒంటిపై రక్తపు చుక్క లేదు. పెద్దగా దెబ్బల ఆనవాళ్లు కూడా లేవు. పొరపాటున కిందపడి గుండె ఆగి చనిపోయినట్టుగానే అందరికీ అనిపించింది. క్లూస్‌టీమ్ వారు కూడా ముందు ఇలాగే అనుకున్నారు. కానీ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టాక దిమ్మ దిరిగే విషయాలు తెలిశాయి. బాలకృష్ణ మరణంలో భార్య సునీతే ప్రధాన సూత్రధారి అని తెలిసింది. ప్రియుడు, అతడి స్నేహితుల సాయంతో ఎవరికీ తెలియకుండా మట్టుబెట్టినట్లు రుజువైంది. పోలీసులు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పూర్తి వివరాల్లోకి వెళితే..

పైడిభీమవరం పంచాయతీలో గల వరిసాం గ్రామంలో జీరు బాలకృష్ణ(35) పాతికేళ్లుగా నివాసం ఉంటున్నారు. స్వగ్రామం చిల్లపేట రాజాం అయినా ఇక్కడే ఉంటున్నాడు. రణస్థలం మండలంలోని మెంటాడకు చెందిన సునీతతో ఈయనకు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాలకృష్ణ రోజు కూలీగా పనిచేస్తుంటారు. సోమవారం ఉదయం వరిసాం పొలాల్లో మర్రి చెట్టు కింద బాలకృష్ణ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే జేఆర్ పురం సీఐ ఎస్.ఆదాం, ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. డీఎస్పీ మహేంద్ర మత్తే కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నిజం తెలిసిందిలా..

పోలీసులు విచారణ మొదలుపెట్టాక బాలకృష్ణను హత్య చేశారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడు బాలకృష్ణతో పాటు కంబాల వెంకటరమణ, అఖిల్, రాములు ఆదివారం రాత్రి నిర్మాణంలో ఉన్న సచివాలయంలో మద్యం సేవించడం చూశామని కొందరు పోలీసులకు చెప్పారు. బాలకృష్ణ తన ఇంటి నుంచే చికెన్ కర్రీ కూడా తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఈ వైపుగా ఇన్వెస్టిగేషన్ చేశారు. ఆదివారం రాత్రి 12 గంటలకు ఈ ముగ్గురే క్రైమ్ కానిస్టేబుల్ లక్ష్మణరావుకు వరిసాం ధాబా వద్ద కనిపించారు. ఆయన వీరి ఫొటో కూడా తీశారు. కానీ అప్పటికి హత్య సంగతి బయటకు పొక్కకుండా వీరు జాగ్రత్త పడ్డారు. ఈ ఫొటోనే హంతకులు దొరికిపోవడానికి సహాయపడింది. ఈ ఆధారాల సాయంతో పోలీసులు నేరుగా కంబాల వెంకటరమణ ఇంటికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించాక అతను అసలు విషయాలు ఒప్పుకున్నాడు. బాలకృష్ణ భార్య సునీతతో తనకు అక్రమ సంబంధం ఉందని, ఆమే రాత్రి చికెన్ కర్రీ, మందుకు డబ్బులు ఇచ్చి భర్తను తమ వద్దకు పంపించిందని చెప్పాడు. తనకు పైడిభీమవరానికి చెందిన కె.దుర్గాప్రసాద్, వరిసాంకు చెందిన రాము సహకరించారని ఒప్పుకున్నాడు.


హత్యకు గురైన బాలకృష్ణ (ఫైల్)

ఆధారాలు దొరక్కుండా మాస్టర్ ప్లాన్..

హత్యపై ముందే ప్రణాళిక వేసుకున్న వెంకటరమణ బ్యాచ్.. ఆధారాలు దొరక్కుండా విఫల ప్రయత్నాలు చేశారు. ఆ ప్లాన్ ప్రకారమే బాలకృష్ణ ప్యాంటు జేబులో ఓ మద్యం బాటిల్ పెట్టారు. మద్యం మత్తులో నడవలేక రాయిపై పడిపోయి గుండెకు దెబ్బ తగిలినట్లు, ముఖం కింద మెడ, మోచేయి, కాళ్లు గీరుకుపోయినట్లు చిత్రీకరించారు. అక్కడ నుంచి కొద్ది దూరం నడిచి వచ్చి మర్రిచెట్టు కింద నీళ్లు అందక చనిపోయినట్లు అందరినీ నమ్మించేద్దామని అనుకున్నారు. నిజానికి రాత్రి మద్యం తాగాక బాలకృష్ణ నోరు మూసి మెడ, ఛాతీపై బలంగా గుద్దడంతో అతను ప్రాణాలు వదిలేశాడు. తర్వాత మృతదేహానికి పైన పేర్కొన్నట్టు ఏర్పాట్లు చేసి మర్రిచెట్టు కింద పడేసి వెళ్లిపోయారు. పోలీసులు చాకచక్యంగా విచారణ చేసి నిజాలను వెలికి తీశారు. నిందితులు హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో మృతుడి భార్య సునీతతో పాటు, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై జి.రాజేష్ తెలిపారు.

భద్రత చర్యలు కల్పించాలని నిరసన


టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన చేస్తున్న రావివలస మెట్‌కోర్ పరిశ్రమ కార్మికులతో చర్చిస్తున్న ఎస్ఐ రామకృష్ణ తదితరులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లయిస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి భద్రత లేకపోవడంతో ఏ క్షణంలో ఏం జరుగుతందోనని భయపడుతున్నారని, తక్షణమే పరిశ్రమలో భద్రత చర్యలు పాటించాలని డిమాండ్ చేస్తూ కార్మికులంతా సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేశారు. పరిశ్రమ నుంచి కార్మికులంతా పెద్ద ఎత్తున టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి నినాదాలు చేశారు. గతంలో పరిశ్రమలో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికులకు ఒక్కొక్కరికి సుమారు రూ.10 లక్షల వరకు వేతనాలు బకాయిలు ఉన్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఫైర్ సేఫ్టీ, వైద్య సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు రోజు వారీ వేతనాల్లో 50 నుంచి 100 రూపాయల వరకు కోత విధిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తీసి వేస్తామని బెదిరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి విన్నవించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన చేస్తున్న విషయం తెలుసుకుని ఎస్ఐ రామకృష్ణతో పాటు మిగిలిన సిబ్బంది సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని కార్మికులతో చర్చించారు.

పకడ్బందీగా ప్రాక్టికల్ పరీక్షలు


ఓ ప్రైవేటు కాలేజ్‌లో ప్రాక్టికల్స్ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్న జిల్లా డీవీఈఓ ప్రకాశరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు కలిపి 10263 మంది హాజరు కావాల్సి ఉండగా 9976 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 287 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లాకు పంపించిన పరిశీలకులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి జిల్లాలోని పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా పరిశీలకుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు జిల్లాలోని ఆరు కేంద్రాల్లో తనిఖీలు చేశారు. జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ కమిటీ సభ్యులు, హెచ్‌పీసీ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరో 62 కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాయి.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి


కాలువ ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక మండల వీధి సమీపంలోని చినబరాటం వీధి కాలువలో జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో చినబరాటం వీధికి నీరుపారే కాలువలో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండటం స్థానికులు గమనించి బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో ఒకటో పట్టణ పోలీసులకు, మండలవీధి సచివాలయం వీఆర్వో చిట్టి మురళీకృష్ణ సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుని శరీరంపై కాఫీ కలర్ టీషర్టు, దానిపైన తెలుపు, నీలం రంగు గడులు గల ఫుల్ హ్యాండ్ షర్టు ఉన్నాయి. తెలుపు, నీలం, కాఫీ రంగులో గల లుంగీ కిందన ధరించి ఉన్నారు. మృతుని వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉండొచ్చని, ఎత్తు 5.5 అడుగులు ఉండవచ్చని, ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయాన కాలువలో జారిపడి నీరు తాగేయడంతో మృతి చెంది ఉంటాడని వీఆర్వో తన రిపోర్టు స్టేట్‌మెంట్‌లో రాయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఈఓ..


ఈఓ యోగేశ్వరరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి రఘుపాత్రుని యోగేశ్వరరావు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యోగేశ్వరరావు ఆదివారం కార్యాలయ పనులకు హాజరై రాత్రి టెక్కలికి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి, కోటబొమ్మాళి సర్పంచ్ కాల్ల సంజీవరావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అక్కడే ఆయన చికిత్స పొందుతూ చనిపోయారు. యోగేశ్వరరావుకు తల్లి, భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

ఆ మృతుని వివరాలు లభ్యం

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని హయాతినగరం సమీపంలో నాగావళి నదీ తీరాన బ్రిడ్జి కింద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం దొరికిన విషయం తెలిసిందే. మృతుడి వివరాలు లభ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. పట్టణంలో ఆరంగివీధిలో నివాసముంటున్న భవన కార్మికుడు కొప్పిసెట్టి సుధ (36) చనిపోయినట్లు గుర్తించారు. సుధకు మద్యం అలవాటు ఉండటంతో తరచూ తన భార్యతో కలహాలు వస్తుండేవి. ఈ క్రమంలో ఈ నెల 25 రాత్రి తొమ్మిది గంటలకు బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పిన సుధ బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. అప్పుడు వెళ్లిన వ్యక్తి ఇలా చనిపోయాడని భార్య ఆవేదన వ్యక్తం చేశారు.

వంశధారలో మునిగి వృద్ధుడి కన్నుమూత


అప్పయ్య మృతదేహం

హిరమండలం: వంశధార నదిలో ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు మునిగి చనిపోయిన ఘటన హిరమండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని భగీరథిపురం గ్రామానికి చెందిన పైల అప్పయ్య(80) గ్రామం పక్కనే ఉన్న వంశధార నదికి సోమవారం స్నానం కోసం వెళ్లారు. ప్రమాదవశాత్తు మునిగి గల్లంతైపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు తహసీల్దార్ బి.మురళీమోహన్, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు వెతికాక అప్పయ్య మృతదేహం దొరికింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ జి.నారాయణ స్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారి గట్లపాడు జంక్షన్‌లో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఏదో వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సోమవారం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీకి తరలించారు. మృతుని వివరాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సమాచారం తెలిస్తే 6309990861 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని పోలీసులు కోరారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ గణేష్ తెలిపారు.

ఆటో.. బైక్ ఢీ

కొత్తూరు: కొత్తూరు మండలం గూనభద్ర బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు, బైక్ నడుపుతున్న ఒకరికి గాయాలైనట్లు ఎస్ఐ ఎం.గోవింద తెలిపారు. ఆటో డ్రైవర్ కింజరాపు రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పత్తి పంటను ఏరుకొని కూలీలతో కొత్తూరు నుంచి గూనభద్ర వైపు ఆటోలో వెళ్తుండగా.. కారిగూడకు చెందిన సవర డేలాగ్రి బైక్‌తో ఎడమ వైపు నుంచి వచ్చి ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు పాడలి గ్రామానికి చెందిన నివిర్తి మోహనరావు, జింకరావు రమణమ్మ, కింజరాపు పద్మావతిలకు గాయాలయ్యాయి. బైక్ రైడర్ కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులకు కొత్తూరు సీహెచ్‌సీలో వైద్యం అందించినట్లు ఎస్ఐ చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీలోని పాలవలసపేట సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవుపురం పంచాయతీ కొండతెంబూరుకు చెందిన నాయుడుగారి కేశవరావు(48) సోమవారం తన పొలం చూసేందుకు తన ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి గ్రామానికి రాంగ్ రూట్‌లో వస్తున్నారు. అదే సమయంలో బెజ్జిపల్లి పంచాయతీ సింగుపురానికి చెందిన నాసు జగదీష్(26) టెక్కలి నుంచి పలాస వైపు బైక్‌పై వస్తుండగా.. పాలవలస పేట సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో కేశవరావు, జగదీష్ ఇద్దరూ గా యపడటంతో హైవే వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి కేశవరావును మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేశవరావు కుమారుడు ఉమాపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమిర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకు లారీ బోల్తా


చినలంకపేట వద్ద బోల్తా పడిన చెరుకు లారీ

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీ రావాడ సమీపంలోని చిన లంకపేట గ్రామం వద్ద సోమ వారం చెరుకు లారీ బోల్తా పడింది. రణస్థలం నుంచి గుమడాం వైపు వెళ్తున్న లారీ చినలంకపేట వద్ద స్కూల్ బస్సును తప్పించబోయి అదుపు తప్పి పడిపోయింది. ఘటనలో డ్రైవర్‌కు చిన్న, చిన్న గాయాలు తప్ప ఎవరికి ఏమీ కాలేదు.